RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి: 4 సంచిక:91

ఆదివారం
మార్చి 22, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

దినపత్రిక



# నీవు లేక.. నేను లేనని..

## భార్య మరణం తట్టుకోలేక ఎస్సై ఆత్మహత్య..!

- అత్తగారింట్లో ఉరివేసుకుని బలవన్మరణం
- అనాథలైన ఇద్దరు పిల్లలు
- పోలీస్ వర్గాల్లో కలకలం

2లో



# గ్యాస్ సెగ బ్లాక్ దందా!

## సిలిండర్ కోసం సామాన్యుడి పాట్లు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రంలో వంట గ్యాస్ సెగలు రేపుతోంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రరూపం దాల్చి, సామాన్యుడి వంటింటిని అస్తవ్యస్తం చేస్తోంది. బుకింగ్ చేసుకుని వారాలు గడుస్తున్నా డెలివరీ ఊసే లేకపోవడంతో వినియోగదారులు రోడ్డెక్కుతున్నారు. తెల్లవారుజాము నుంచే ఖాళీ సిలిండర్లతో కిలోమీటర్ల మేర బారులు తీరుతున్న దృశ్యాలు రాష్ట్రవ్యాప్త సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. ఒకవైపు గ్యాస్ ఏజెన్సీలు స్టాక్ లేదు అని బోర్డులు తిప్పేస్తుంటే, మరోవైపు అదే గ్యాస్ బ్లాక్ మార్కెట్‌లో రూ. 1500 నుంచి రూ. 2000 వరకు అమ్ముడవుతుండటం గమనార్హం. గృహ అవసరాలకు వాడాల్సిన రాయితీ సిలిండర్లు అధికారుల కళ్లు గప్పి హోటళ్లు, రెస్టారెంట్ల వంటి వ్యాపార సంస్థలకు తరలిపోతున్నాయి. కమర్షియల్ గ్యాస్ భారం తట్టుకోలేక హోటల్ యజమానులు డొమెస్టిక్ గ్యాస్‌ను వాడుతుండటంతో.. సామాన్య వినియోగదారుడికి సిలిండర్ గగనమవుతోంది. దీంతో గ్యాస్ కొనలేక, అందక మధ్యతరగతి జనం మళ్లీ పాత రోజుల్లోకి వెళ్తున్నారు. పట్టణ శివార్లలో సైతం కట్టెల పొయ్యిలు దర్శనమిస్తున్నాయి.



2లో

### సరఫరాలో తీవ్ర జాప్యం..
### డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి..

- బుకింగ్ చేసుకున్నా 'నో స్టాక్' మాట
- గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారుల క్యూ
- తెల్లవారుజాము నుంచే ఖాళీ సిలిండర్లతో దర్శనం
- కృత్రిమ కొరతను సృష్టిస్తున్న ఏజెన్సీలు
- బ్లాక్‌లో భారీ ధరలకు పెద్ద రెస్టారెంట్లకు అమ్మకం
- ధరల భారం భరించలేక చిన్న హోటళ్లు బంద్
- గ్యాస్ కొరతతో నిత్యావసరాల ధరలకూ రెక్కలు
- మళ్లీ కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్న మహిళలు

## భద్రాద్రి సమగ్ర అభివృద్ధికి

# మాస్టర్ ప్లాన్..

- మూడుదశల్లో అమలు
- అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి లక్ష్యం
- యాత్రికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
- పుష్కరాలు, కల్యాణ మహోత్సవానికి సమగ్ర ఏర్పాట్లు
- మంత్రుల సమీక్ష సమావేశం

2లో



## పర్యాటక కేంద్రాలపై

# ఇరాన్ టార్గెట్

- అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు దేశాలపై దాడులకు స్కెచ్
- నంటాజ్ అణుకేంద్రంపై మిస్సైల్ దాడులు
- ఉద్రిక్తంగా మారుతున్న యుద్ధ పరిస్థితులు

2లో



# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్‌బై?

## పార్టీ మారేందుకు రంగం సిద్ధం

- మంత్రుల శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు విఫలం
- అధిష్ఠానం హామీలు ఫలించలేదు.. నిర్ణయం ఖరారు అన్న సంకేతాలు
- రేపు అనుచరులతో కీలక సమావేశం
- 25న బహిరంగ సభలో అధికారిక ప్రకటన చేసే అవకాశం?
- బీఆర్ఎస్‌లో చేరేందుకు ఏర్పాట్లు.. ఏప్రిల్‌లో గ్రాండ్ జాయినింగ్ ప్లాన్



2లో

# కట్టుకథలతో కప్పిపుచ్చే కుతంత్రం

## ఈఓ బాగోతం బట్టబయలు.. అయినా తప్పించుకునే ప్రయత్నం

### రసీదు బుక్ మాయంపై తప్పుడు కథనాల సృష్టి

- శాశ్వత కల్యాణ టికెట్ల విక్రయంలో రూ.6.5 లక్షల అక్రమాల ఆరోపణలు
- డే బుక్‌లో నమోదు లేకుండా నగదు మాయం చేసినట్టు విమర్శలు
- చైర్మన్ సంతకాలతో తప్పుడు రికార్డులు సృష్టించారనే ఆరోపణ
- విచారణకు రంగం సిద్ధం.. మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

దేవాదాయ ధర్మాదాయ శాఖలో మరో సంచలనం వెలుగులోకి వచ్చింది. వరంగల్ జోన్ పరిధిలోని ప్రముఖ దేవాలయంలో గతంలో ఈఓగా పనిచేసిన అధికారి శాశ్వత కళ్యాణ టికెట్ల విక్రయంలో అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. స్వామివారి శాశ్వత కళ్యాణం పేరిట భక్తులకు విక్రయించే టికెట్ల వ్యవహారంలో ఈఓ నేరుగా జోక్యం చేసుకుని, రసీదు బుక్ నెం.3లోని 201 నుంచి 300 వరకు ఉన్న 100 టికెట్లు స్వయంగా విక్రయించి నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఒక్కో టికెట్ ధర రూ.6,500 ఉండగా, మొత్తం రూ.6,50,000 వసూలైన ఈ మొత్తాన్ని దేవస్థానం డే బుక్‌లో నమోదు చేయకుండా, ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా వ్యక్తిగతంగా వినియోగించుకున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు రసీదు బుక్ నెం.3 పోయిందని రికార్డుల్లో తప్పుడు కథ సృష్టించినట్లు తెలుస్తోంది. ఆలయ చైర్మన్ సంతకాలను వినియోగిస్తూ తప్పుడు తీర్మానాలు రూపొందించడం, అధికారిక రికార్డులను మార్పిడి చేయడం వంటి అంశాలు బయటపడుతున్నాయి. పక్కా ఆధారాలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేరడంతో ఈ వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఆరోపణలపై శాఖ అధికారులు విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. నిజాలు బయటపడితే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



వేద న్యూస్

ఆదివారం | మార్చి 22, 2026

# పర్యాటక కేంద్రాలపై ఇరాన్ టార్గెట్

- అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు దేశాలపై దాడులకు స్కెచ్
- నంటాజ్ అణుకేంద్రంపై మిస్సైల్ దాడులు
- ఉద్రిక్తంగా మారుతున్న యుద్ధ పరిస్థితులు



**వేద న్యూస్, డెస్క్**

తమ శత్రుదేశాలతో పాటు అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరించే దేశాల్లోని పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించడం అంతర్జాతీయ స్థాయిలో ఆందోళన కలిగిస్తోంది. రిక్రియేషనల్ పార్కులు, టూరిస్ట్ డెస్టినేషన్స్ వంటి ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ సైనిక అధికారి అబోల్ఫాజి షెకార్చి వెల్లడించారు. ఈ హెచ్చరికలతో యుద్ధం మరింత విస్తరించే అవకాశం ఉందన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఇరాన్‌లోని కీలక నంటాజ్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ మిస్సైల్ దాడులకు పాల్పడింది. శనివారం ఉదయం జరిగిన ఈ దాడుల్లో అణుకేంద్రానికి పెద్దగా నష్టం జరగలేదని ఇరాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఎలాంటి రేడియేషన్ లీకేజీ జరగలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అయితే ఈ కేంద్రంపై మళ్లీ దాడి జరగడం పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తోంది. నంటాజ్ అణుకేంద్రం ఇరాన్‌కు అత్యంత కీలకమైన సదుపాయం. గతంలో కూడా ఈ కేంద్రంపై దాడులు జరిగినప్పటికీ పెద్ద ప్రమాదం తప్పింది. టెహ్రాన్‌కు దక్షిణ–ఆగ్నేయ దిశలో ఉన్న ఈ కేంద్రం అణు కార్యక్రమాలకు ప్రధానంగా ఉపయోగపడుతోంది. ఇలాంటి కీలక స్థావరాలపై దాడులు జరగడం ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఇరాన్ యుద్ధం ప్రారంభమై ఇప్పటికే నాలుగు వారాలు పూర్తయ్యాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ త్వరలో దాడులు ముగుస్తాయని ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ దాడి జరగడం పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా ఉందో తెలియజేస్తోంది. మరోవైపు అమెరికా వేలాది మెరైన్ సైనికులను మోహరించడం యుద్ధం మరింత ముదిరే సూచనలుగా కనిపిస్తోంది. మొత్తంగా ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో పరిస్థితులను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. పర్యాటక కేంద్రాలపై దాడుల హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా భద్రతా ఆందోళనలను పెంచుతున్నాయి. పరిస్థితి ఎలా మారుతుందో అన్న దానిపై అంతర్జాతీయ సమాజం ఆతురతగా గమనిస్తోంది.

# భద్రాద్రి సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్..



**వేద న్యూస్, భద్రాచలం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భద్రాచలం పునర్‌నిర్మాణం మరియు పునరుజ్జీవనం ప్రాజెక్ట్‌ను మూడు దశల్లో అమలు చేయాలని నిర్ణయించారు. యాత్రికుల సౌకర్యాలను మెరుగుపరచడం ఈ ప్రణాళికలో ప్రధానంగా ఉండనుంది. పార్కింగ్ సదుపాయాలు, రహదారుల విస్తరణ, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ సమాచార కేంద్రాలు వంటి మౌలిక వసతులను విస్తృతంగా అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మాడ వీధుల అభివృద్ధి, కల్యాణ మండప నిర్మాణం, రామవనం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర్ ఘాట్‌ల నిర్మాణం, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యవంతమైన దర్శన విధానం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. అదేవిధంగా రామవరం వద్ద ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడం, సమీప దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టడం కూడా ప్రణాళికలో భాగంగా ఉంది. ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని లైటింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు, అగ్నిమాపక చర్యలు, అంబులెన్సులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా, భక్తుల భావాలను గౌరవిస్తూ చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భద్రాచలం అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# గ్యాస్ సెగ.. బ్లాక్ దందా!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**




- సిలిండర్ కోసం సామాన్యుడి పాట్లు
- సరఫరాలో తీవ్ర జాప్యం.. బుకింగ్ చేసుకున్నా 'నో స్టాక్' మాట
- గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారుల క్యూ
- తెల్లవారుజాము నుంచే ఖాళీ సిలిండర్లతో దర్శనం
- కృత్రిమ కొరతను సృష్టిస్తున్న ఏజెన్సీలు
- డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి..
- బ్లాక్‌లో భారీ ధరలకు పెద్ద రెస్టారెంట్లకు అమ్మకం
- ధరల భారం భరించలేక చిన్న హోటళ్లు బంద్
- గ్యాస్ కొరతతో నిత్యావసరాల ధరలకూ రెక్కలు
- మళ్లీ కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్న మహిళలు

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత కొద్ది రోజులుగా వంట గ్యాస్ కొరత తీవ్రరూపం దాల్చింది. సకాలంలో సిలిండర్లు అందక వినియోగదారులు అల్లాడిపోతున్నారు. బుకింగ్ చేసుకున్న వారాల తరబడి వేచి చూసినా డెలివరీ కాకపోవడంతో, విసిగిపోయిన జనం నేరుగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు చేరుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే ఖాళీ సిలిండర్లతో కిలోమీటర్ల మేర క్యూలైన్లలో వేచి చూస్తున్న దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. గంటల తరబడి నిలబడినా స్టాక్ లేదు అనే సమాధానం రావడంతో వినియోగదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఆకాశాన్నంటుతున్న ధరలు

సాధారణ వినియోగదారులకు గ్యాస్ అందకపోవడానికి ప్రధాన కారణం బ్లాక్ మార్కెట్ అని ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ఏజెన్సీలు కావాలనే కృత్రిమ కొరతను సృష్టించి, పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. డొమెస్టిక్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు ఏజెన్సీల వద్ద స్టాక్ లేదని చెబుతూనే, మరోవైపు బ్లాక్‌లో రెట్టింపు ధరకు సిలిండర్లు సరఫరా అవుతుండటం గమనార్హం. సామాన్యులకు అందాల్సిన రాయితీ గ్యాస్, అక్రమ మార్గాల్లో వ్యాపార అవసరాలకు తరలిపోతోంది. అవసరాన్ని బట్టి ఒక్కో డెమెస్టిక్ సిలిండర్ ధర రూ.1500 నుంచి 2వేల వరకు కూడా అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం

కమర్షియల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడం, కొరత ఉండటంతో పలు హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాలకు వాడే సిలిండర్లను వాడుతున్నారు. కొంతమంది అధికారులు గ్యాస్ ఏజెన్సీలు మరియు హోటల్ యజమానులతో ములాఖత్ అయ్యి, ఈ అక్రమాలకు వంత పాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలు నామమాత్రంగానే సాగుతుండటంతో, గృహ వినియోగదారులకు దక్కాల్సిన కోటా హోటళ్ల వంటగదుల్లో మండిపోతోంది.

## బందైన చిన్న హోటళ్లు

గ్యాస్ కొరత ప్రభావం నేరుగా సామాన్యుడి కడుపు మీద కొడుతోంది. గ్యాస్ అందక, బ్లాక్‌లో భారీ రేట్లు పెట్టి కొనలేక అనేక చిన్నపాటి హోటళ్లు, టిఫిన్ సెంటర్లు మూతపడుతున్నాయి. నడుస్తున్న మరికొన్ని హోటళ్లలో వంట ఖర్చు పెరిగిందనే సాకుతో దోశ, ఇడ్లీ నుంచి మీల్స్ వరకు అన్నింటి ధరలను భారీగా పెంచేశారు. దీంతో బయట తినే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ సిలిండర్ ధర కంటే రవాణా మరియు బ్లాక్ రేటు భారంగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు.

## మళ్లీ పాత రోజుల్లోకి..

గ్యాస్ సిలిండర్ కోసం వేచి చూసి విసిగిపోయిన జనాలు, చివరకు గత్యంతరం లేక పాత రోజుల్లోకి వెళ్తున్నారు. పల్లెల్లోనే కాకుండా పట్టణ శివార్లలో సైతం మళ్లీ కట్టెల పొయ్యిలు దర్శనమిస్తున్నాయి. పెరట్లోనూ, ఇంటి ముందు ఖాళీ స్థలాల్లోనూ రాళ్లతో కట్టుపొయ్యిలు ఏర్పాటు చేసుకుని వంటలు చేసుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్ ఇచ్చి మమ్మల్ని ఆధునిక కాలంలోకి తెచ్చారు.. ఇప్పుడు గ్యాస్ ఇవ్వక మళ్లీ పొగచూరిన జీవితాల్లోకి నెట్టేశారు.. అంటూ గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్‌బై?



**వేద న్యూస్, జగిత్యాల**

## పార్టీ మారేందుకు రంగం సిద్ధం

- మంత్రుల శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు విఫలం
- అధిష్టానం హామీలు ఫలించలేదు.. నిర్ణయం ఖరారు అన్న సంకేతాలు
- రేపు అనుచరులతో కీలక సమావేశం
- 25న బహిరంగ సభలో అధికారిక ప్రకటన చేసే అవకాశం?
- బీఆర్ఎస్‌లో చేరేందుకు ఏర్పాట్లు.. ఏప్రిల్‌లో గ్రాండ్ జాయినింగ్ ప్లాన్

కాంగ్రెస్ పార్టీలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పడం దాదాపు ఖరారైన నిర్ణయంగా మారినట్లు విశ్వసనీయ సమాచారం. గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న బుజ్జగింపుల ప్రయత్నాలు విఫలమవడంతో ఆయన ఎగ్జిట్ తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే అసంతృప్తితో జీవన్ రెడ్డి ఇప్పటికే మానసికంగా దూరమయ్యారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు జరిగిన చర్చలు ఫలితం ఇవ్వకపోవడం పరిస్థితిని మరింత స్పష్టంచేసింది. సీనియర్ నేతను నిలబెట్టుకోవడంలో పార్టీ విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీవన్ రెడ్డిని పార్టీలోనే కొనసాగించేందుకు మంత్రి శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జగిత్యాలలో నిర్వహించిన కీలక భేటీ కూడా ఫలితం ఇవ్వలేదు. గంటకు పైగా సాగిన ఈ చర్చల్లో పలు హామీలు ఇచ్చినా జీవన్ రెడ్డి వాటిని తిరస్కరించినట్లు సమాచారం. తన వర్గానికి జరిగిన అన్యాయం, కీలక నిర్ణయాల్లో పక్కనబెట్టడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం జీవన్ రెడ్డి నేడు తన కోర్ టీం, కీలక అనుచరులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ నెల 25న జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించి అధికారిక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏప్రిల్ 5 నుంచి 10 మధ్య భారీ జన సమీకరణతో గ్రాండ్ జాయినింగ్ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమైందని సమాచారం.

# నీవు లేక.. నేను లేనని..

## భార్య మరణం తట్టుకోలేక ఎస్సై ఆత్మహత్య

- అత్తగారింట్లో ఉరివేసుకుని బలవన్మరణం
- అనాథలైన ఇద్దరు పిల్లలు..
- పోలీస్ వర్గాల్లో కలకలం



**వేద న్యూస్, కరీంనగర్**

కరీంనగర్ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. భార్య ఆత్మహత్య చేసుకుందన్న బాధతో మనస్తాపానికి గురైన ఓ సబ్ ఇన్స్పెక్టర్ తానూ ప్రాణాలు తీసుకున్నారు. వరుస మరణాలతో ఆ కుటుంబంలో చీకటి అలముకున్నది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ టూటౌన్ ఎస్సైగా స్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ యాదవ్, జమ్మికుంట మండలం సీతంపేట గ్రామంలోని తన అత్తగారింట్లో బలవన్మరణానికి గురి అవడం,ఈ నెల ఈ నెల 17న ఆయన భార్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన ఎస్సై చంద్రశేఖర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆమె లేని జీవితం వద్దనుకుని తాను కూడా ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నారు.భార్య భర్తల మరణంతో ఇద్దరు చిన్న పిల్లలు అనాథలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు ఇలా ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కొండెక్కిన కోడి

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

## భారీగా పెరిగిన చికెన్ ధరలు

- ఒక్కరోజులో రూ.70 పెరుగుదల
- ఎండలు, డిమాండ్ పెరుగుదలతో రేట్లు
- నాటుకోడి ధర కిలో రూ.800.. మటన్‌తో పోటీ
- వినియోగదారులకు భారంగా మారిన నాన్ వెజ్ భోజనం



తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకి వినియోగదారులకు భారీ షాక్ ఇచ్చాయి. నిన్నటి వరకు సాధారణంగా ఉన్న ధరలు కేవలం ఒక్క రోజులోనే భారీగా పెరిగి మార్కెట్‌ను కుదిపేశాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చికెన్ ధర కిలోకు దాదాపు రూ.70 వరకు పెరగడం గమనార్హం. దీంతో ఆదివారం భోజనం కోసం చికెన్ కొనాలనుకున్న వారికి ఖర్చు రెట్టింపు అయిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం విజయవాడలో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.380 నుంచి రూ.400 వరకు పలుకుతుండగా, హైదరాబాద్‌లో రూ.340 నుంచి రూ.350 మధ్య విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి ధరలు మరింత పెరిగి కిలోకు రూ.800 వరకు చేరాయి. ఈ రేట్లు మటన్ ధరలతో పోటీ పడుతున్న స్థాయికి చేరుకోవడం వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ధరల పెరుగుదల వెనుక పలు కీలక కారణాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. తీవ్ర ఎండల కారణంగా కోళ్లు పెద్ద సంఖ్యలో మృతి చెందడంతో మార్కెట్‌లో సరఫరా తగ్గిపోయింది. మరోవైపు రంజాన్ పండుగ నేపథ్యంలో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, శుభకార్యాలు అధికంగా ఉండటంతో డిమాండ్ మరింత పెరిగింది. అదే సమయంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగాయి. కోళ్లకు ఇచ్చే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు అదనపు భారం మోయలేక ధరలను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అన్ని అంశాలు కలిసి చికెన్ ధరలను ఒక్కసారిగా పెంచినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. మొత్తంగా చూస్తే, సరఫరా తగ్గడం, డిమాండ్ పెరగడం వల్ల చికెన్ ధరలు మరికొంతకాలం అధికంగానే ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధరలు తగ్గే వరకు వినియోగదారులు ప్రత్యామ్నాయాలను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# 'మధ్యాహ్న భోజనం'పై గరికపాటి వివాదాస్పద వ్యాఖ్యలు

**వేద న్యూస్, డెస్క్**

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన ఉచిత భోజనం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తప్పుబడుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ముఖ్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులను 'శోభనపు పెళ్లికొడుకులతో' పోల్చడం తీవ్ర విమర్శలకు కారణమైంది. విద్యార్థులు చదువు కోసం కాకుండా ఉచిత భోజనం కోసం మాత్రమే పాఠశాలకు వస్తున్నారనే భావం వచ్చేలా ఆయన మాట్లాడినట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలు విద్యార్థుల ఆసక్తిని తగ్గిస్తున్నాయని, అవసరమైన వస్తువులను వారు స్వయంగా సమకూర్చుకుంటేనే చదువుపై శ్రద్ధ పెరుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే కోడిగుడ్ల లెక్కలు చూసుకోవడంలోనే ఉపాధ్యాయుల సమయం వృథా అవుతోందని కూడా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర ప్రతికూల స్పందన వ్యక్తమవుతోంది.

వేద న్యూస్

ఆదివారం మార్చి 22, 2026

# త్యాగం, సేవా భావానికి ప్రతీక రంజాన్

**- చిలుక రవీందర్**



**వేద న్యూస్, చొప్పదండి:**

మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని ఈద్గా ప్రాంగణంలో రుక్మాపూర్, కాట్నపల్లి, చాకుంట గ్రామాల ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై ముస్లిం సోదరులకు హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ త్యాగం, నియమం, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని ఆయన అన్నారు. అయితే ఇంకా అనేక ప్రాంతాల్లో ముస్లిం సోదరులు ప్రాథమిక సదుపాయాలకు నోచుకోకపోవడం బాధాకరమని, ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ అధికారులతో మల్టీ జోన్ ఐజీపీ సమీక్ష

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాకు విచ్చేసిన మల్టీ జోన్- ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, సర్కిల్ వారీగా శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, నమోదు అయిన కేసులలో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరుస్తూ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా పనిచేయాలని పేర్కొన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో 5ఎస్ విధానంలో రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్‌పై దృష్టి సారించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై నిఘాను కఠినతరం చేయాలని సూచించారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా తిరిగి ఇంటికి చేరే లక్ష్యంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. అలాగే



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక"లో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, రవి, ఆర్ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలి

**- మండల శాఖ అధ్యక్షులు రాచూరి శ్రీధర్**

**- నర్సింగపూర్‌లో బీఆర్ఎస్ గ్రామ శాఖ సమావేశం**



**వేద న్యూస్, ధర్మారం:**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశానుసారం మండలంలోని నర్సింగపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా గొడుగు మల్లయ్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మండల ప్రచార కార్యదర్శి ఐతే వెంకటస్వామి, గ్రామ వార్డు సభ్యులు చల్ల గంగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనకట్ల సంతోష్, సీనియర్ నాయకులు తోట కొమురెల్లి, గుండా శ్రీనివాస్ రెడ్డి, గుండా సత్యనారాయణ రెడ్డి, గొడుగు ప్రశాంత్, నల్ల శ్రీనివాస్ రెడ్డి, దుద్దేల రమేష్, దుద్దేల రవి, కాంపెల్లి తిరుపతి, గొడుగు లక్ష్మణ్, చల్ల కొమురయ్య, స్వర్గం రాములు, కంపెల్లి అంజయ్య, సిరికొండ శంకరయ్య, పుప్పాల అంజయ్య, గొడుగు సురేష్, సామ మహిపాల్ రెడ్డి, కనకట్ల శంకరయ్య, గొడుగు రాజేష్, పంబల మల్లేష్, పంబల కుమార్, బత్తినీ అంజి, గొడుగు అనిల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత

**వేద న్యూస్, ధర్మారం:**



మండలంలోని బుచ్చయ్యపల్లె గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు సందనవేని కొమురయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసు కున్న కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ (కెనడా) సభ్యులు వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటుగా 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు, యాదవ సంఘం అధ్యక్షుడు తమ్మడవేణి అంజయ్, జిల్లా బీసీ కన్వీనర్ తమ్మడవేణి శ్రీనివాస్, అమర గోని కుమార్, ఆవుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్వాంగ సుందరంగా వేములవాడ అభివృద్ధి

**- రూ.46 లక్షలతో ఆధునిక సౌకర్యాలు**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలోని బ్రిడ్జి నుండి ఆలయం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుమారు రూ.46 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ స్తంభాల పనులను పరిశీలించారు. పట్టణ ప్రజల 50 ఏళ్ల చిరకాల కోరిక అయిన రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్న పాత విద్యుత్ స్తంభాల స్థానంలో ఆధునిక స్తంభాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ నిర్వహణ సులభతరం కావడమే కాకుండా పట్టణ సుందరీకరణ కూడా మెరుగుపడుతుందని చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# విద్యారంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**- విద్యకు కేవలం 8.22% కేటాయించడం దారుణం**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్**

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాల దహనం**

**వేద న్యూస్, కరీంనగర్:**




విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శించారు. అసెంబ్లీలో కేటాయించిన నిధులు చూస్తే ఇది విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. స్థానిక గీతా భవన్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యారంగానికి కేవలం 8.22% నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో 15% కేటాయిస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విశ్వవిద్యాలయాలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలకు తగిన నిధులు కేటాయించకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యారంగానికి కనీసం 30% నిధులు కేటాయించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- వరి, మొక్కజొన్నకు ఎకరానికి రూ.30 వేలు..**

**- మామిడి తోటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి**

**- బీజేపీ మండల కార్యదర్శి బానోత్ అనిల్**

**వేద న్యూస్, అక్కన్నపేట:**

అక్కన్నపేట మండలంలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో రైతులు తీవ్రంగా నష్టపోయారని భారతీయ జనతా పార్టీ మండల కార్యదర్శి భానోత్ అనిల్ నాయక్ తెలిపారు. ఇప్పటికే ఎండల కారణంగా బోర్లు, బావులు ఎండిపోవడంతో వరి పంట దెబ్బతినగా, అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న పూర్తిగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే మామిడి తోటల రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని, పండ్లు రాలిపోవడంతో లక్షల రూపాయల పెట్టుబడులు వృథా అయ్యాయని పేర్కొన్నారు. చేతికొచ్చే సమయంలో జరిగిన ఈ నష్టాల వల్ల రైతులు ఆర్థికంగా కుంగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో గ్రామాల వారీగా పర్యటించి నష్టాల అంచనాలు వేయించాలని, యుద్ధ ప్రాతిపదికన పరిహారం అందించాలని కోరారు. గతంలో జరిగిన నష్టాలకు కూడా ఇప్పటివరకు పరిహారం ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో చర్యలు తీసుకుని వరి, మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున, మామిడి తోటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని జిల్లా, మండల అధికారులతో నష్టాల అంచనాలు వేయించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.



# విలాసాగర్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

**- సామరస్యానికి నిదర్శనంగా ఉత్సవాలు**

**- ముఖ్య అతిథిగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య హాజరు**

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు సామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య హాజరై వేడుకలను శోభాయమానం చేశారు. ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్యను ఘనంగా సన్మానించారు. గ్రామంలో స్నేహభావం, ఐక్యతను మరింత బలపరిచిన ఈ వేడుకలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచాయి.

# ఈద్గాలో శుభాకాంక్షలు తెలిపిన మందడి సరోజ్ రెడ్డి

**వేద న్యూస్, భూత్పూర్:**

రంజాన్ పండుగ సందర్భంగా భూత్పూర్ మున్సిపాలిటీలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మందడి సరోజ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేళ సామరస్య వాతావరణంలో ముస్లిం సోదరులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కౌన్సిలర్ ప్రేమ్ కుమార్, మురళీ గౌడ్, సాదిక్, సమీర్, చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అంజన్నను సన్నిధిలో బండి సంజయ్

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి**

**వేద న్యూస్, మల్యాల:**



జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం దర్శించారు. ఈ సందర్భం గా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, పలువురు కార్పొరేటర్లతో కలిసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మంత్రి రాకను పురస్కరించుకుని ఆలయ అధికారులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బండి సంజయ్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గర్భగుడిలోకి ప్రవేశించి శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ పూజారులు మంత్రికి శాలువా కప్పి ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు
- వనపర్తి ఈద్గా వద్ద ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు

**వేద న్యూస్, వనపర్తి:**



రంజాన్ పండుగ సందర్భంగా వనపర్తి పట్టణంలోని గోపాల్పేట రోడ్‌లో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లెల్ల చిన్నారెడ్డి ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో నిష్టగా ఉన్న ముస్లిం సోదరులు పండుగ రోజు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కులమతాలకు అతీతంగా శుభాకాంక్షలు పంచుకోవడం ఐక్యతకు మారుపేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సభ్యులు శంకర్ ప్రసాద్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, జిల్లా యూత్ నాయకులు ఆదిత్య, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల నాటి సొంతింటి కల నెరవేరింది..

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఆనందం
- గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి..

**వేద న్యూస్, వనపర్తి:**



ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందడంతో సొంత గృహం నిర్మించుకోగలిగామని తెలిపారు. శనివారం వనపర్తి పట్టణంలోని 15వ వార్డుకు చెందిన దీపిక-ఉపేందర్, 21వ వార్డు మేఘ్యా తాండకు చెందిన దన్ సింగ్-చిట్టెమ్మ కుటుంబాల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎన్నో సంవత్సరాలు అద్దె ఇళ్లలో జీవించామని, సొంతింటి కల నెరవేరదని భావించిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆశ కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, ఆయన సహకారంతోనే ఇంటి నిర్మాణం వేగంగా పూర్తయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు సౌమ్య రాఘవేంద్ర, ధనలక్ష్మి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సురేష్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మా నాన్న ప్రాణాలు కాపాడండి..

- మీకు తోచిన సాయం చేయండి
- బాలుడి హృదయ విదారక విజ్ఞప్తి
- పక్షవాతం బారిన పడ్డ తండ్రి చికిత్సకు డబ్బుల్లేక ఆవేదన
- దాతలు ముందుకు రావాలని వేడుకుంటున్న 12 ఏళ్ల శ్రీనాథ్

**వేద న్యూస్, ముస్తాబాద్:**



ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన 12 ఏళ్ల బాలుడు శ్రీనాథ్ తన తండ్రి ప్రాణాలను కాపాడాలని దాతలను వేడుకుంటూ హృదయ విదారక విజ్ఞప్తి చేస్తున్న ఘటన కలచివేస్తోంది. పల్నాటి రాజయ్యకు అకస్మాత్తుగా పక్షవాతం రావడంతో ఆయన సిద్దిపేటలోని లోహిత్ సాయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే కుటుంబంలో తల్లి, అన్న, అక్కలు అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. లక్షల రూపాయలు ఖర్చు చేసి వారిని కోల్పోయిన ఈకుటుంబానికి ప్రస్తుతం చికిత్స ఖర్చులు భరించడం కష్టంగా మారింది. 'మా నాన్నను కాపాడండి.. మీకు తోచిన సహాయం చేయండి' అంటూ బాలుడు కన్నీటి పర్యంతంగా వేడుకుంటున్నాడు. ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు దాతలను కోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే నంబర్: 9618751687 (పల్నాటి రాజయ్య) కు ఆర్థిక సహాయం అందించవచ్చు.

# జన ఔషధి కేంద్రం ప్రారంభం

- తక్కువ ధరలకు నాణ్యమైన మందులు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**వేద న్యూస్, కరీంనగర్:**



మందుల ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను వినియోగించు కోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచిం చారు. నగరంలోని ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందుల ధరలు అధికంగా ఉండటంతో, చాలా మందికి వాటిని కొనుగోలు చేయడం కష్టంగా మారిందని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసి, తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. బ్రాండెడ్ మందులతో పోలిస్తే తక్కువ ధరలకు సమాన నాణ్యత కలిగిన మందులు అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని చౌక ధరలకు మందులు పొందాలని మంత్రి కోరారు.

# జిల్లా జనరల్ సెక్రటరీ, జిల్లా కార్యదర్శికి ఘన సన్మానం



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ గా నియామకమైన కర్క అశోక్ కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియామకమైన పత్తి రాముకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, మాజీ జడ్పిటీసి నారోజి గంగారాం, పట్టేపు రాములు, మంత్రి గంగారాం, నాయకులు తోట సంగయ్య, కుర్మాజీ సాయిలు, అడప శంకర్, పార్వతి ప్రవీణ్, వడ్ల నరేష్, శివ ,పార్వతి ప్రవీణ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రుద్రూర్ గ్రామ సర్పంచ్ సునీత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఈద్ మీలాప్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రంజాన్ పండుగను జరుపుకున్న మైనారిటీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపి తేనేటి విందును ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్, ఉపసర్పంచ్ నిస్సార్ కాద్రి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కర్కా అశోక్, వార్డు సభ్యులు పోశెట్టి, బక్క శివకుమార్, కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పోతురాజు లింగం, కొత్తపల్లి రవికిరణ్ ,మేక వెంకన్న, పార్వతీ ప్రవీణ్, వడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాములవారి గుట్ట వద్ద బోరు ప్రారంభం

- గ్రామస్తుల అభ్యర్థనపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం గట్టుబుత్కూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి గుట్టకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ప్రతి రోజు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించగా, శ్రీరామనవమి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అయితే గుట్ట వద్ద తాగునీటి సమస్య నెలకొనడంతో గ్రామస్తులు చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బోర్ మరియు మోటార్ ఏర్పాటు చేయించారు. శనివారం ఈ బోర్‌ను గ్రామ సర్పంచ్ మల్కాపురం రాజేశ్వరి-రాజేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేనేత-పవర్లూమ్ సమస్యలపై 25న మహా ధర్నా

- ఇందిరా పార్క్ వద్ద కార్మికుల భారీ నిరసనకు పిలుపు
- రంగాల అభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



చేనేత-పవర్లూమ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా బి.వై.నగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వం చేనేత, పవర్లూమ్ రంగాలకు తగిన బడ్జెట్ కేటాయింపులు చేయలేదని ఆయన విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణతో పాటు పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# బచ్చలకూరి నాగరాజును సన్మానించిన ముస్లిం సోదరులు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



నేలకొండపల్లి మండలం కొంట్లగూడెం లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ బచ్చలకూరి నాగరాజు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి వారితో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ... శాంతి సహనంతో-అపారవిశ్వాసంతో అత్యంత భక్తి శ్రద్దలతో నెలరోజులపాటుగా కఠోర ఉపవాస దీక్షలు చేస్తారని ఆయన అన్నారు. త్యాగాలకు చివరి అంకమైన ఈద్-ఉల్-ఫితర్ ఈ సర్వ మానవాళిలో సోదరభావం, సమానత్వం, సమైక్యత, దాతృత్వ స్ఫూర్తిని నింపుతుందని ఆయన తెలిపారు.అనంతరం స్పోక్స్ పర్సన్ గా నియమితులైన నాగరాజు ను ముస్లిం సోదరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సలీం మహబూబ్ పాషా, సోహెల్,అజీద్,సైధు, రియన్, పాషా,నాగుల్ పాషా,జానీ,షేక్ సలీం రియాజ్ సైదా బోదులు అక్బర్ భాష లాలు సైద నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈద్ మిలాప్ కార్యక్రమం

**వేద న్యూస్, రుద్రూర్ :**



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ఈద్ మీలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపి తేనేటి విందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, నాయకులు తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, మాజీ జడ్పిటీసి నారోజీ గంగారాం, పార్వతి ప్రవీణ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేట లో ఘనంగా రంజన్ వేడుకలు

**వేద న్యూస్, పాపన్నపేట :**



పాపన్నపేట మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. శనివారం పాపన్నపేట రహదారి సమీపన,పలు గ్రామాలలో ఈద్గా ల వద్ద అల్లాహ్ కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థన లో రంజాన్ మాస విశిష్టతను మత గురువు వివరించారు. పేద,ధనిక తేడా లేకుండా అలింగనం చేసుకుంటూ, రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. పాపన్నపేటలో ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బంది తో బందోబస్తు నిర్వహించారు.

# ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

**– ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీ నగర్, మట్టేవాడ (పోతన నగర్), ఖిలా వరంగల్ ఈద్గాల్లో ముస్లిం సోదరులతో శనివారం కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అల్లాహ్ దీవెనలతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ సోదరభావం, దాతృత్వం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని పెంపొందించే ఈ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, స్థానిక ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**– ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు.. పరస్పరం శుభాకాంక్షల వెల్లువ**

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



ముస్లింల పవిత్ర పండగ రంజాన్ సందర్భంగా చిన్నచింతకుంట మండల వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పండుగ సందర్భంగా ముస్లింలు ఉదయం నుంచే ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనం తరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి వివేక్

**వేద న్యూస్, మందమర్రి :**



రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం మానవాళికి ఉన్నతమైన విలువలను నేర్పించే పవిత్ర కాలమని ఆయన గుర్తు చేశాడు. శనివారం పవిత్రమైన రంజాన్ పండుగ ను పురస్కరించుకొని పట్టణంలో ని పలు ఈద్గాల వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశాడు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, అనురాగా లు, మానవత్వంతో ప్రజలందరూ ప్రజలందరూ ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.రూ.50 లక్షలతో షాదిఖానా, ఈద్గా ఈద్గాల వద్ద కంపోండ్ వాల్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# సమైక్యతా సౌరభం..రంజాన్ సంబరం!

**– ముస్లిం సోదరులతో తుంబూరు దయాకర్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంక్షేమ పథకాలపై భరోసా**

ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం" అని భరోసా ఇచ్చారు.

**ఆత్మీయ ఆతిథ్యం**

పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్ రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



# టీపీసీసీ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపిన సత్యనారాయణ గౌడ్

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీని ప్రకటించినందుకు, సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగంగా కీలకమైన జిల్లా కాంగ్రెస్ కమిటీని విస్తరించినందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ టిపిసిసి అద్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.... అనాదికాలం నుండి పార్టీలో కష్టపడుతున్న అన్ని కుల,మత,వర్గాల వారీగా,ఎన్నికల వాగ్దానం బిసి డిక్లరేషన్ మేరకు ,సామాజిక,రాజకీయ నియమాలను పాటిస్తూ జాబితా తయారు చేయడమైనదని అన్నారు. ఈ సందర్భంలో జిల్లా లోని అన్ని నియోజకవర్గాల నుండి మరికొందరు ఆశావాహులు,కాంగ్రెస్ పార్టీ కొరకు మొదటి నుంచి పనిచేసినవారు ఉన్నారని ముఖ్యంగా యువకులు,మహిళలను మరొక జాబితాగా తీసుకోవాలని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. వారి సూచన మేరకు కొద్ది రోజులలో ఎగ్జిక్యూటివ్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి,రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి,శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి ల సలహా సూచనల మేరకు రెండవ జాబిత్ తయారు చేసి టిపిసిసి అద్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు పంపుతామని, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. అదే విధంగా ఈ కమిటీ ఏర్పాటుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘు రాంరెడ్డి, శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మట్టా రాగమయి లకు కృతజ్ఞతలు తెలిపారు,ముందు ముందు వారి సహాయ, సహకారం ఇలాగే ఉండాలని ఆకాక్షించారు.



# అక్షర పాఠశాల విద్యార్థులకు నవోదయలో ప్రవేశం



**– అర్హత పరీక్షలో ముగ్గురు విద్యార్థుల విజయం**

**వేద న్యూస్, రామడుగు:**

జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్వీ) నిర్వహించిన అర్హత పరీక్షలో మండలంలోని గోపాల్రావుపేట్ అక్షర పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్ తెలిపారు. ఈ సందర్భంగా అరోహి ఓవరాల్, జీ శివమణి తేజ, జీ నిక్షితలు వరుసగా 16, 19, 119 ర్యాంకులు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారని చెప్పారు. గత సంవత్సరం కూడా తమ పాఠశాల విద్యార్థులు నవోదయలో ప్రవేశం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు

# గోమాత ద్వారా ఆంజనేయస్వామి విగ్రహ ఉద్వాసన

**– దేవాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం.. గణేష్ హోమంతోప్రారంభం**

**– విజయదశమి నాటికి నిర్మాణం పూర్తి చేయాలన్న గ్రామస్తుల సంకల్పం**

**వేద న్యూస్, రేవల్లి:**

రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులు ఏకమయ్యారు. చందాలు సమీకరించి ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామస్తులు గణేష్ హోమం నిర్వహించి పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దేవాలయంలో ఉన్న పాత ఆంజనేయస్వామి విగ్రహాన్ని గోమాత ద్వారా ఉద్వాసన చేసి తరలించారు. వచ్చే విజయదశమి నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్ కుమార్

**– నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలని సూచన**

**వేద న్యూస్, వెల్గటూర్:**

వెల్గటూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ఆసుపత్రిని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం సాయంత్రం ప్రారంభించారు. డాక్టర్ శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షిత హాస్పిటల్‌ను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండటం చాలా అవసరమని అన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు.



# మాది ప్రజా ప్రభుత్వ బడ్జెట్

**– తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ షన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



**వేద న్యూస్, హైదరాబాద్ :**

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, అందుకు నిదర్శనం 2026- 27 ఆర్థిక బడ్జెట్ అని, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం,దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందడగు వేస్తుందని అందుకు కాంగ్రెస్ నాయకత్వానికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు అందజేస్తున్నానని, తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రికార్డ్ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు సాగుతూ ప్రజలు చెల్లించే ప్రతి పైసాకు కాపలాధారుగా ఉంటూ వారి అభ్యున్నతి కోసమే ఈ బడ్జెట్ అత్యంత చిత్తశుద్ధితో రూపొందించడం జరిగిందని అన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అద్భుతమైన ప్రగతిని సాధించిందని దేశ జిడిపి వృద్ధిరేటు 9.8 శాతం నుండి 8 శాతానికి తగ్గి మందగమనంలో ఉన్నప్పటికీ తెలంగాణ వృద్ధి రేటు 10.6 శాతం నుండి10.7 శాతానికి మెరుగుపడడం విశేషమని అన్నారు. ప్రస్తుతం ధరల ప్రకారం రాష్ట్ర జి ఎస్ డి పి 17,82,198 కోట్ల రూపాయలకు చేరిందని దేశ సగటు వృద్ధిరేటు కంటే తెలంగాణ 2.7 శాతం అధిక వృద్ధిని నమోదు చేస్తుందని ఇందుకు ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమన్వయంతో పని చేయడమే అని అన్నారు. దేశ జిడిపిలో మన రాష్ట్రం ఐదు శాతం వాటాతో బలమైన గ్రోత్ ఇంజన్ గా నిలుస్తుందని మన ప్రభుత్వ ఆర్థిక విధానాలు సరియైన దిశలో సాగుతున్నాయి అనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే దిశగా బడ్జెట్ రూపొందించడం అభినందనీయమని వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్లో పెద్దపీట వేశారని దీనితో వారి సంక్షేమానికి మరింత సంక్షేమ కార్యక్రమాలు అందే అవకాశం ఉందని అన్నారు.

**మధ్యాహ్న భోజనం పేదలకు వరం**

ముఖ్యంగా బడ్జెట్లో ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేసిందని జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించడం పేద విద్యార్థుల పాలిట వరం అని ఇది అభినందనీయమని ప్రస్తుతం పాఠశాల వరకే ఈ పథకం అమలు జరుగుతుందని దీని కాలేజీ విద్యార్థులకు కూడా అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించి ఇప్పుడు అమలులో పెట్టిందని పాఠశాలల్లో "ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ స్కీములు" కూడా ఈ బడ్జెట్లో ప్రతిపాదించడం స్వాగతించదగ్గ అంశమని ఈ పథకంతో ఇరవై ఒక్క లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందడం అభినందించదగ్గ అంశమని అన్నారు. ఏది ఏమైనా నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి దార్శనితకు నిదర్శనమని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.

# చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

**– రూ.1.11 కోట్లతో అభివృద్ధి**
**– ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**

**వేద న్యూస్, జడ్చర్ల:**

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో పోచమ్మ గుడి సమీపంలోని ఊర కుంట చెరువు పునరుద్ధరణ పనులకు శనివారం ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.1.11 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల ద్వారా స్థానికులకు నీటి వనరులు మెరుగుపడడంతో పాటు పర్యావరణ సమతౌల్యం సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి రూపాయి ప్రజల అవసరాలకు వినియోగిస్తామని, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్మన్ సారిక రామ్మోహన్, వార్డ్ కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, కోట్ల ప్రశాంత్ రెడ్డి, ఉమాశంకర్ గౌడ్, రమేష్, సాహితి రెడ్డి, కురుమూర్తి, గుండు ఉమాదేవి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణానికి ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ముదిగొండ మండలంలోని ముత్తారం గ్రామం నందు ఈనెల 27 రాత్రి 7.00 గంటలకు జరుగు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం నకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుని శనివారం హైదరాబాద్ ప్రజా భవన్ నందు జిల్లా కాంగ్రెస్ నాయకులు మల్లెల అజయ్ నాయకత్వంలో కలిసి వారికి సాదరంగా ఆహ్వానం పలికారు. బడ్జెట్ సమావేశాల వలన వత్తిడి ఉన్నా... తప్పకుండా ఈసారి ముత్తారం సీతారాముల కళ్యాణానికి తప్పక వస్తానని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తారం సర్పంచ్ లంజపల్లి మమత, దేవాలయ చైర్మన్ లతా, వనం వారి కృష్ణాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు పొదిలి తిరపయ్య, ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు లంజపల్లి బుచ్చయ్య,మాజీ చైర్మన్ తుళ్లూరి జీవన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్ట వీరయ్య, ముప్పారపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, హనుమకొండ:**

తెలంగాణ ప్రభుత్వం అటవీ శాఖ, హనుమకొండ జిల్లా, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం భాగంగా జిల్లా అటవీ శాఖాధికారి బి. లావణ్య, ఫారెస్ట్ కాంప్లెక్స్, సుబేదారి నుంచి కాకతీయ జూలాజికల్ పార్క్ వరకు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పర్యావరణ పరిరక్షణపై ప్రాధాన్యతను వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాని కోసం అడవులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మట్టి పాత్రల్లో నీరు, ఆహారం ఉంచడం ద్వారా పక్షులు, జీవజాలానికి సహాయపడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి. మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు ఇందారం నాగేశ్వర్ రావు, చెలుపూరి శ్యామ్ సుందర్, పిట్టల రవి బాబు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పని రాధిక, జిల్లా అటవీ శాఖ సిబ్బంది, జూ పార్క్ సెక్షన్ ఆఫీసర్లు సురి దాస్, శివ కుమార్, బీట్ ఆఫీసర్లు శారద, శ్వేత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

**– పంట నష్టాలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మానసిక ఆందోళన**
**– వీర్నపల్లిలో విషాద ఘటన..**

**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం శాంతినగర్ ప్రాంతంలో అప్పుల భారంతో ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. గూగులోత్ గోపాల్ (34) అనే రైతు చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. స్థానికుల సమాచారం ప్రకారం, గోపాల్ కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తూ అప్పుల్లో కూరుకుపోయాడు. పంటలు ఆశించిన మేరకు రాకపోవడం, అప్పుల ఒత్తిడి పెరగడంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గోపాల్‌కు భార్య నిర్మల, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే ఆధారం కోల్పోవడంతో వారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# గౌస్ పాషాకు సన్మానం చేసిన అజ్మీర వీరన్న

**వేద న్యూస్ ,కారేపల్లి:**



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే కార్యక్రమం జరిగింది. మాజీ మండల ప్రధాన కార్యదర్శి, గిరిజన నాయకుడు అజ్మీర వీరన్న ముస్లిం సోదర సోదరీమణులకు హృదయ పూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుట్టకింద గుంపు పంచాయతీకి చెందిన మాజీ మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ గౌస్ పాషాకు మండల నాయకులు, విలేకరులు, యువకులు కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం అన్ని మతాల మధ్య సోదరభావం, ఐక్యతను మరింత బలపరచాలని సూచించింది. ఈ కార్యక్రమంలో వాంకుడొత్ నరేష్, మర్కకట్ల రోశయ్య, భూక్య రాంకిషోర్, బాణోత్ కోటి, గుగులోత్ హారు, వాంకుడొత్ విజయ్, మాలోత్ రజనీకాంత్, బాణోత్ చక్రం (వీరన్న), జర్పుల చందర్, జర్నలిస్టులు ధరవత్ చందు, పచ్చిపాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో గీత కార్మికులకు అన్యాయం

**– గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్**

**వేద న్యూస్, హుస్నాబాద్:**



రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికులకు తగిన నిధులు కేటాయించకపోవడం ద్వారా ప్రభుత్వం అన్యాయం చేసిందని గౌడ సంఘం (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. శనివారం హుస్నాబాద్‌లో మాట్లాడుతూ, గీత కార్మికుల కార్పొరేషన్‌కు సరైన నిధులు లేకపోవడంతో ఆర్థిక సహాయం అందడం లేదన్నారు. ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్య పింఛన్లలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు ధృవపత్రాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సిద్దిపేటలో హెల్త్ క్యాంప్ పేరుతో సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించి చైర్మన్‌ను నియమించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే హుస్నాబాద్‌లో గౌడ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు.

# ఘనంగా రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**వేద న్యూస్, జడ్చర్ల:**



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్, కావేరమ్మపేట ప్రాంతాల్లో నిర్వహించిన ఈదుల్ ఫితర్ వేడుకల్లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ సోదరభావం, ప్రేమ, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఈ పండుగ అందరికీ శాంతి, సౌభాగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా మైనార్టీ సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

# ఎస్ఐ బైరు గోపిని సన్మానించిన విలేకరులు

**వేద న్యూస్,కారేపల్లి:**



కారేపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బైరు గోపిని ఆయుధం అక్షరం కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో సాగింది. స్థానిక పత్రికల విలేకరులు సమిష్టిగా పాల్గొని శాలువా కప్పి ఎస్ఐ బైరు గోపిని సత్కరించారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ సమర్థవంతంగా వ్యవహరిస్తోందని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ఎస్ఐ బైరు గోపి చూపుతున్న చురుకుదనం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎస్ఐ బైరు గోపి మాట్లాడుతూ పత్రికారంగం సమాజానికి దారిదీపంలాంటిదని, ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేయడంలో విలేకరుల పాత్ర అపారమని అన్నారు. పోలీస్ శాఖ, పత్రికా రంగం పరస్పర సమన్వయంతో పనిచేస్తే సమాజంలో శాంతి, చైతన్యం మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుధం అక్షరం కమిటీ సభ్యులు, వివిధ పత్రికల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆహ్వానం

**వేద న్యూస్,కారేపల్లి:**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తూరు తండా, చిన్న మడంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించనున్న పవిత్ర ఉత్సవాలకు పోలంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, ఖమ్మం జిల్లా దిశ కమిటీ సభ్యురాలు హేమలత బాలాజీకి ఆహ్వాన ప్రతీకను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న మడంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, ఆలయ ప్రధాన అర్చకులు బానోత్ రవీందర్ పాల్గొని మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హేమలత బాలాజీ మాట్లాడుతూ, శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని చెప్పుకొచ్చారు.

# ఐర్లాండ్‌తో టీమిండియా టీ20 సిరీస్..



**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్ నియంత్రణ మండలి జూన్ నెలకు సంబంధించిన అంతరా జ్తీయ షెడ్యూల్‌ను ప్రకటిస్తూ కీలక నిర్ణయం వెల్లడించింది. టీమిండియా ఐర్లాండ్ జట్టుతో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుందని స్పష్టం చేసింది. ఈ మ్యాచ్‌లు జూన్ 26, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు బెల్‌ఫాస్ట్ వేదికగా నిలవనుంది. ముఖ్యంగా 2007 తర్వాత మళ్లీ అదే మైదానంలో భారత జట్టు మ్యాచ్ ఆడనుండటం విశేషంగా మారింది. అప్పటి నుంచి అనేకసార్లు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పటికీ, బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌లు జరగలేదు. ఇప్పుడు మళ్లీ ఈ వేదికపై మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. గత ఎనిమిదేళ్లలో భారత జట్టు మూడు సార్లు ఐర్లాండ్ పర్యటన చేసింది. 2018, 2022, 2023 సంవత్సరాల్లో అక్కడ సిరీస్‌లు ఆడింది. అయితే ఈసారి షెడ్యూల్‌లో ప్రత్యేకత ఏమిటంటే, ఇంగ్లండ్ పర్యటనకు ముందే ఐర్లాండ్ సిరీస్‌ను ప్లాన్ చేయడం. దీంతో విదేశీ పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడేందుకు ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు. ఈ టూర్‌కు ముందు భారత జట్టు ఆఫ్ఘానిస్థాన్‌తో ఒక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. ఈ సిరీస్ జూన్ 20 నాటికి ముగియనుంది. అనంతరం వెంటనే ఐర్లాండ్ పర్యటన ప్రారంభమవుతుంది. వరుసగా మ్యాచ్‌లు ఉండటంతో ఆటగాళ్ల ఫిట్‌నెస్, జట్టు సమతుల్యత కీలకంగా మారనుంది. ఇక ఐర్లాండ్ సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు బయలుదేరనుంది. జూలై 1 నుంచి 19 వరకు ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. ఈ సిరీస్ కూడా ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా భావిస్తున్నారు. భవిష్యత్ అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా జట్టు కాంబినేషన్‌ను పరీక్షించేందుకు ఇది మంచి వేదికగా నిలవనుంది. మొత్తంగా చూస్తే, జూన్–జూలై నెలల్లో టీమిండియాకు బిజీ షెడ్యూల్ ఎదురవుతోంది. ఐర్లాండ్ సిరీస్ చిన్నదైనా, ఇంగ్లండ్ పర్యటనకు ముందస్తు సన్నాహకంగా కీలక పాత్ర పోషించనుంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం, బెంచ్ స్ట్రెంగ్త్‌ను పరీక్షించడం వంటి అంశాల్లో ఈ మ్యాచ్‌లు ఎంతో ఉపయోగపడనున్నాయి.

# కోల్‌కతాకు వరుస షాక్‌లు.. గాయంతో ఆకాశ్ దీప్ ఔట్



**వేద న్యూస్ డెస్క్:**

పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్ రైడర్స్‌జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రధాన పేసర్లు గాయాల కారణంగా దూరమవ్వగా, తాజాగా భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ కూడా గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే హర్షిత్ రానా, మథీశ పథిరన గాయాల వల్ల జట్టుకు దూరమయ్యారు. దీంతో కోల్‌కతా పేస్ దళం తీవ్రంగా దెబ్బతింది. ఈ క్రమంలో ఆకాశ్ దీప్ ఉన్నాడనే నమ్మకంతో ఉన్న యాజమాన్యానికి అతని గాయం మరో పెద్ద షాక్‌గా మారింది. ఫలితంగా జట్టు బౌలింగ్ విభాగం దాదాపు ఖాళీ అయిన పరిస్థితి నెలకొంది. గత మూడు సీజన్లుగా కోల్‌కతా బౌలింగ్ దళానికి ప్రధాన బలంగా నిలిచిన హర్షిత్ రానా మోకాలి గాయంతో దూరమవ్వడం జట్టుకు పెద్ద లోటు. మరోవైపు వేలంలో భారీ ధరకు కొనుగోలు చేసిన మథీశ పథిరన ఆడడంపై కూడా అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆకాశ్ దీప్‌పై ఆశలు పెట్టుకున్న ఫ్రాంచైజీకి అతని గాయం తీవ్ర నిరాశ కలిగించింది. ఇటీవలి కాలంలో గాయాలతో ఇబ్బంది పడుతున్న ఆకాశ్ దీప్ మైదానంలో కంటే రిహాబిలిటేషన్ కేంద్రంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నాడు. గత మినీ వేలంలో సుమారు ఒక కోటి రూపాయలకు కొనుగోలు చేసిన ఈ పేసర్ ఇప్పుడు టోర్నీకి దూరమవ్వడంతో జట్టుకు పెద్ద నష్టం కలిగింది. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ వర్గాలు కూడా ధృవీకరించాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కోల్‌కతా బౌలింగ్ బాధ్యతలు కొత్తగా జట్టులోకి వచ్చిన బ్లెస్సింగ్ ముజరబానీపై ఎక్కువగా పడనున్నాయి. అనుభవం తక్కువగా ఉన్న బౌలర్లతోనే జట్టు ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక పంతొమ్మిదో సీజన్ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు మార్చి 29న ముంబై జట్టుతో తలపడనుంది. వరుస గాయాలతో బలహీనపడిన జట్టు ఈ సీజన్‌లో ఎలా రాణిస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది. అభిమానులు మాత్రం ఈ పరిస్థితుల్లో జట్టు ప్రదర్శనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పాక్ కోచ్‌గా చేదు అనుభవం.. తొలిసారి స్పందించిన గ్యారీ కిర్‌స్టెన్



**వేద న్యూస్ డెస్క్:**

భారత జట్టుకు 2011లో వన్డే ప్రపంచకప్ అందించిన ప్రముఖ కోచ్ గ్యారీ కిర్స్టన్, పాకిస్థాన్ జట్టుతో తన అనుభవంపై తొలిసారి నోరు విప్పాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 2024 ఏప్రిల్‌లో పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కిర్‌స్టెన్, కేవలం ఆరు నెలలకే తన పదవికి రాజీనామా చేయడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ఆయన వెల్లడించారు. తాజాగా ఒక క్రీడా మాధ్యమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నుంచి ఊహించని స్థాయిలో జోక్యం ఎదురైందని కిర్‌స్టెన్ చెప్పారు. “నా కోచింగ్ కెరీర్‌లో ఇంతటి జోక్యాన్ని ఎప్పుడూ చూడలేదు. బయట నుంచి వచ్చే ఒత్తిడి, సూచనలు మధ్య జట్టుతో సమర్థవంతంగా పనిచేయడం చాలా కష్టం అవుతుంది” అని ఆయన పేర్కొన్నారు. జట్టు ఎంపిక, వ్యూహాల విషయంలో బోర్డు తరచూ జోక్యం చేసుకోవడం వల్ల తనకు ఇబ్బందులు కలిగాయని ఆయన తెలిపారు. “జట్టు సరిగా రాణించనప్పుడు కోచ్‌ను బాధ్యుడిగా నిలబెట్టడం సులభం. అలాంటప్పుడు కోచ్‌ను నియమించడం ఎందుకు?” అంటూ ఆయన ప్రశ్నించారు. కోచ్‌కు పూర్తి స్వేచ్ఛ ఇవ్వకుండా ఫలితాలు ఆశించడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో తన ప్రయాణాన్ని ముగించిన కిర్‌స్టెన్ ఇప్పుడు శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టుహెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. 2026 ఏప్రిల్ 15 నుంచి రెండేళ్ల ఒప్పందంతో ఆయన శ్రీలంక జట్టుతో పనిచేయనున్నాడు. ఈ క్రమంలో 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేయడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన మాజీ ఓపెనర్‌గా కిర్‌స్టెన్ అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష విజయాలు సాధించాడు. టెస్టులు, వన్డేల్లో కలిపి 14 వేలకుపైగా పరుగులు నమోదు చేసిన ఆయన, కోచ్‌గా మారిన తర్వాత భారత్ వంటి జట్లకు చారిత్రాత్మక విజయాలు అందించాడు. మొత్తంగా, పాకిస్థాన్ జట్టుతో తన అనుభవాన్ని బహిర్గతం చేస్తూ కిర్‌స్టెన్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీశాయి. బోర్డు–కోచ్ సంబంధాలపై మరోసారి దృష్టి సారించేలా ఈ పరిణామం మారింది.

# ఒక్క నిమిషం కూడా వేస్ట్ చేయొద్దు..



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో ఉత్సాహం, ఉత్కంఠ పెరిగిపోయింది. గత సీజన్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన ఆర్సీబీ ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలని గట్టి సంకల్పంతో సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జట్టు స్టార్ ఆటగాడు

విరాట్ కోహ్లీ తన సహచరులకు గట్టి హెచ్చరికతో పాటు ప్రేరణనిచ్చే సందేశాన్ని ఇచ్చాడు. మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఆర్సీబీ శిబిరంలో విరాట్ చేసిన ప్రసంగం ఇప్పుడు విస్తృతంగా చర్చనీయాంశమైంది. జట్టు అధికారిక సామాజిక మాధ్యమాల్లో విడుదలైన వీడియోలో కోహ్లీ చాలా గంభీరంగా మాట్లాడుతూ, ప్రతి క్షణాన్ని వినియోగించుకోవాలని ఆటగాళ్లను హెచ్చరించాడు. గత రెండు మూడు సంవత్సరాల కష్టానికి ఫలితంగా గత ఏడాది టైటిల్ సాధించామని గుర్తుచేసిన అతను, ఈసారి సవాలు మరింత కఠినంగా ఉండబోతోందని స్పష్టం చేశాడు. ఇతర జట్లు తమపై మరింత దూకుడుతో దాడి చేయబోతున్నాయని, అందుకే ప్రాక్టీస్ సెషన్లలో ఒక్క నిమిషం కూడా వృథా చేయకూడదని కోహ్లీ సూచించాడు. వచ్చే రెండున్నర నెలలు ప్రతి ఆటగాడు నూట ఇరవై శాతం శ్రమించాల్సిందేనని, అదే విజయానికి మార్గమని పేర్కొన్నాడు. అతని ఈ మాటలతో జట్టు ఆటగాళ్లలో కొత్త ఉత్సాహం నింపబడినట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో రజత్ పటిదార్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, విరాట్ కోహ్లీ జట్టుకు మార్గదర్శిగా వ్యవహరిస్తున్నాడు. కోచ్ ఆండీ ఫ్లవర్ నేతృత్వంలో వేలం ద్వారా జట్టును మరింత బలపరిచామని యాజమాన్యం నమ్మకంగా ఉంది. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు కొత్త ప్రతిభావంతులు జట్టులో చేరడం ఆర్సీబీకి అదనపు బలం కలిగిస్తోంది. గత సీజన్‌లో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో పంజాబ్ జట్టును ఓడించి తొలి టైటిల్ గెలిచిన ఆర్సీబీ, ఈసారి కూడా అదే జోష్‌తో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. విరాట్ కోహ్లీ ఇచ్చిన హెచ్చరికతో జట్టు ఇప్పుడు మరింత కట్టుదిట్టంగా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈసారి కూడా ఆర్సీబీ తన విజయ పరంపరను కొనసాగిస్తుందా లేదా అనేది అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# కామెంటరీకి గుడ్‌బై..

**వర్ణ వివక్ష ఆరోపణలతో సంచలనం సృష్టించిన శివరామకృష్ణన్**



**వేద న్యూస్ డెస్క్:**

భారత మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత లక్ష్మణ్ శివరామకృష్ణన్ తన కామె ంటరీ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించి క్రీడా వర్గాల్లో సంచలనం సృష్టించాడు.

దాదాపు 23 ఏళ్లుగా కొనసాగుతున్న తన వ్యాఖ్యాత జీవితం నుంచి తప్పుకుంటూ, తనను పక్కన పెట్టడానికి వర్ణ వివక్ష కూడా ఒక కారణమని ఆరోపించడం పెద్ద చర్చకు దారితీసింది. సోషల్ మీడియా వేదికగా తన నిర్ణయాన్ని ప్రకటించిన శివరామకృష్ణన్, గత కొన్నేళ్లుగా తనకు సరైన అవకాశాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. “ఇన్నేళ్లుగా కామెంటరీ చేస్తున్నప్పటికీ, టాస్‌లు, ప్రజెంటేషన్ కార్యక్రమాల్లో నన్ను భాగం చేయలేదు. కొత్తగా వచ్చిన వారికి ఆ అవకాశాలు ఇస్తున్నారు. దీనికి కారణం ఏమిటి?” అని ప్రశ్నించాడు. ఈ సందర్భంగా ఒక నెటిజన్ చేసిన వ్యాఖ్యకు ఆయన ఇచ్చిన సమాధానం వివాదానికి దారితీసింది. “బహుశా మీరు నల్లగా ఉండటం వల్లేమో” అనే కామెంట్‌కు, “మీరు చెప్పింది నిజమే.. వర్ణ వివక్ష” అని ఆయన స్పందించడం చర్చను మరింత వేడెక్కించింది. అయితే ఈ వ్యాఖ్యలపై వివాదం పెరగడంతో శివరామకృష్ణన్ మళ్లీ స్పందించాడు. తన అసంతృప్తి మొత్తం బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా పై కాదని, ఒక వ్యక్తిగత సమస్య కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని స్పష్టం చేశాడు. ఈ విషయంలో బీసీసీఐ కార్యదర్శికి ఎలాంటి సంబంధం లేదని కూడా పేర్కొన్నాడు. తన జీవితంపై నిర్ణయాలు తీసుకునే హక్కు తనకే ఉందని ఆయన తెలిపాడు.

# వరల్డ్ కప్ 2027 నిబంధనలు ఇవే..

## – కీలక మార్పులు చేసిన అంతర్జాతీయ క్రికెట్ మండలి



**వేద న్యూస్ డెస్క్:**

క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వరల్డ్ కప్ 2027 టోర్నీకి సంబంధించిన ఫార్మాట్, కొత్త నిబంధనలను అంతర్జాతీయ క్రికెట్ మండలి వెల్లడించింది. ఈసారి 14 జట్లతో, సరికొత్త విధానాలతో టోర్నీ మరింత ఉత్కంఠభరితంగా మారనుంది. ఈ ప్రపంచకప్‌కుదక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా సౌతాఫ్రికా, జింబాబ్వేలకు నేరుగా టోర్నీలో ప్రవేశం లభించగా, నమీబియా మాత్రం అర్హత సాధన పోటీల ద్వారా అవకాశం పొందాలి. మార్చి 31, 2027 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో మొదటి ఎనిమిది స్థానాల్లో ఉన్న జట్లు నేరుగా ఈ టోర్నీలోకి ప్రవేశిస్తాయి. మిగిలిన నాలుగు స్థానాల కోసం ప్రత్యేక అర్హత పోటీలు నిర్వహిస్తారు. దీంతో ఈసారి పోటీ మరింత కఠినంగా ఉండనుంది.

**సూపర్ సిక్స్ విధానం ప్రత్యేకత**

ఈసారి పాత విధానానికి బదులుగా సూపర్ సిక్స్ విధానాన్ని ప్రవేశపెట్టారు. మొత్తం 14 జట్లను రెండు గ్రూపులుగా విభజిస్తారు. ఒక్కో గ్రూప్‌లో ఏడు జట్లు ఉంటాయి. లీగ్ దశలో ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని మిగతా జట్లతో తలపడుతుంది.

ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. అక్కడ పాయింట్ల ఆధారంగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం ఫైనల్ పోరుతో విజేతను నిర్ణయిస్తారు. ఈ విధానం వల్ల ప్రతి మ్యాచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడనుంది.

**మూడు ముఖ్య నిబంధనలు**

ఈసారి టోర్నీలో మూడు కీలక నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయనున్నారు. మొదటిగా, మ్యాచ్ సమంగా ముగిసినట్లయితే సూపర్ ఓవర్ నిర్వహించడం తప్పనిసరి. విజేత తేలే వరకు సూపర్ ఓవర్లు కొనసాగిస్తారు. గతంలో జరిగిన వివాదాలకు ఇది పూర్తి స్థాయిలో ముగింపు పలికే అవకాశం ఉంది. రెండవది, సాఫ్ట్ సిగ్నల్ విధానాన్ని పూర్తిగా తొలగించారు. ఇకపై ఫీల్డ్ అంపైర్ ఇచ్చే ప్రాథమిక అభిప్రాయం ఉండదు. మూడవ అంపైర్ స్పష్టమైన ఆధారాల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటాడు. మూడవది, మైదానాల్లో బౌండరీ పరిమాణంపై కఠిన నిబంధనలు అమలు చేస్తారు. బౌండరీ లైన్ కనీసం 70 మీటర్లకు తగ్గకుండా ఉండాలని స్పష్టం చేశారు. దీని వల్ల ఆటలో సమతుల్యత పెరుగుతుంది.

**వేదికలు, పరిస్థితులు**

ఈ టోర్నీ ప్రధానంగా సౌతాఫ్రికాలో జరుగనుండగా, జింబాబ్వే, నమీబియాలోని కొన్ని మైదానాలను కూడా వినియోగించనున్నారు. ఆఫ్రికా మైదానాలు సాధారణంగా పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉండటంతో ఈసారి బౌలర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉండే అవకాశముంది.

మొత్తంగా చూస్తే, కొత్త విధానాలు, కఠిన నిబంధనలతో ఈసారి వరల్డ్ కప్ మరింత ఆసక్తికరంగా మారనుంది. ప్రతి మ్యాచ్ కీలకంగా మారే ఈ టోర్నీ అభిమానులకు ఉత్కంఠభరిత అనుభూతిని అందించనుంది.

వేద న్యూస్

ఆదివారం మార్చి 22, 2026

# ‘రాకాస’ తో నిహారిక రీఎంట్రీ


**వేద న్యూస్ డెస్క్:**



మెగా ఫ్యామిలీకి చెందిన నటి, నిర్మాత కొణిదెల నిహారిక మరోసారి వార్తల్లో నిలిచారు. హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించి, తరువాత నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఇప్పుడు ‘రాకాస’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ‘పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్’ బ్యానర్‌పై నిర్మించిన ‘కమిటీ కుర్రాళ్లు’ విజయం తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ హీరోగా నటిస్తుండగా, ఇది హర్రర్–కామెడీతో పాటు ఫాంటసీ అంశాలు కలిసిన వినోదాత్మక చిత్రంగా రూపొందుతోంది. కుటుంబ సమేతంగా చూసేలా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తీర్చిదిద్దామని నిహారిక వెల్లడించారు. ఇదివరకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ’ మంచి విజయాన్ని సాధించగా, ఇప్పుడు అదే కాంబోలో సినిమా రావడం ఆసక్తిని పెంచుతోంది. ఏప్రిల్ 3న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా నటనకు దూరంగా ఉన్న నిహారిక మళ్లీ కెమెరా ముందు నిలబడాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం పలు కథలు వింటున్నానని, అందులో కొన్ని కథలు తనకు బాగా నచ్చాయని ఆమె తెలిపారు. అన్ని అనుకూలిస్తే 2027లో మళ్లీ హీరోయిన్‌గా ప్రేక్షకుల ముందుకు రావాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో నిహారిక సెకండ్ ఇన్నింగ్స్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.

# ‘ఉస్తాద్ భగత్ సింగ్’కు కలెక్షన్ షాక్


**వేద న్యూస్ డెస్క్:**




ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అనూహ్య మలుపు తీసుకుంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజు మంచి వసూళ్లు సాధించినప్పటికీ, రెండో రోజు కలెక్షన్స్‌లో భారీ పతనం నమోదైంది. ఉగాది సందర్భంగా విడుదలైన ఈ సినిమా తొలి రోజు దేశవ్యాప్తంగా సుమారు రూ.34 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించగా, రెండో రోజు మాత్రం ఆ వేగాన్ని కొనసాగించలేక సుమారు రూ.9 కోట్లకే పరిమితమైంది. రెండు రోజుల్లో మొత్తం ఇండియా నెట్ కలెక్షన్స్ సుమారు రూ.44 కోట్లకు చేరగా, ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.59 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు సమాచారం. రెండో రోజు కలెక్షన్స్ పడిపోవడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సినిమాకు వచ్చిన మిశ్రమ స్పందన ప్రేక్షకులను కొంత వెనక్కి తగ్గేలా చేసింది. అదనంగా వర్కింగ్ డే కావడం వల్ల థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. మరోవైపు రణవీర్ సింగ్ నటించిన ‘ధురంధర్ 2’ హిందీ వెర్షన్ పోటీ కూడా కొంత ప్రభావం చూపినట్లు ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో ఈ పోటీ స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం ఈ సినిమా భవితవ్యం పూర్తిగా వీకెండ్ కలెక్షన్స్‌పైనే ఆధారపడి ఉంది. రంజాన్ సెలవులు, శని–ఆదివారాల్లో వసూళ్లు పెరిగితేనే చిత్రం మళ్లీ పుంజుకునే అవకాశం ఉంది. అయితే పోటీ మరింత పెరగనుంది. ‘ధురంధర్ 2’ తెలుగు వెర్షన్ కూడా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పరిస్థితి సవాలుగా మారింది. పవన్ కళ్యాణ్ గత చిత్రం ‘ఓజీ’ భారీ విజయానంతరం వచ్చిన ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. కానీ ప్రస్తుత ట్రెండ్ చూస్తే, ఈ చిత్రం విజయావకాశాలు పూర్తిగా వచ్చే రెండు రోజుల ప్రదర్శనపైనే ఆధారపడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# ఏఏ23 పై క్రేజ్ పీక్స్‌లో

**వేద న్యూస్ డెస్క్:**




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, తమిళ స్టార్ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న భారీ చిత్రం ‘ఏఏ23’పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్ దేశవ్యాప్తంగా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరాలు అందించనుండగా, సంక్రాంతి సందర్భంగా విడుదలైన ప్రత్యేక వీడియో సినిమాపై హైప్‌ను మరింతగా పెంచింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. నిర్మాతలుగా నవీన్ యెర్నేని, వై రవిశంకర్ వ్యవహరిస్తుండగా, బన్నీ వాస్‌తో పాటు ఇతరులు సహనిర్మాతలుగా ఉన్నారు. ఇక ఈ సినిమా నటీనటుల ఎంపికపై ప్రస్తుతం ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇప్పటికే బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ఈ చిత్రంలో నటించనున్నట్లు వార్తలు వస్తుండగా, తాజాగా మరో స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ నిజమైతే, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు మరింత క్రేజ్ వచ్చే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు దర్శకుడు లోకేశ్ కనగరాజ్ తన సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ముందుగా ‘ఖైదీ 2’పై దృష్టి పెట్టనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ, ఇప్పుడు అల్లు అర్జున్‌తో ప్రాజెక్ట్ ప్రకటించడంతో ఆ సినిమా తాత్కాలికంగా వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన లోకేశ్, అల్లు అర్జున్‌ను కలవడం కూడా ఈ వార్తలకు బలం చేకూర్చింది. ప్రస్తుతం అల్లు అర్జున్ మరో దర్శకుడు అట్లీతో సినిమా చేస్తుండగా, ఆ ప్రాజెక్ట్ పూర్తైన తర్వాత కొంత విరామం తీసుకుని ‘ఏఏ23’ చిత్రీకరణలో పాల్గొననున్నాడు. ఈ ఏడాది ద్వితీయార్థంలో షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. కథ ఇప్పటికే ఖరారై, స్క్రిప్ట్ పనులు కొనసాగుతున్న ఈ చిత్రం యాక్షన్, స్టైల్, బలమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందనుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# సందీప్ కిషన్ ఫాంటసీ అడ్వెంచర్ ప్రారంభం

**వేద న్యూస్ డెస్క్:**




యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవల ‘శంబాల’ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షిం చిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందు కు తీసుకు రానున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిత`మవుతున్న ఈ చిత్రం హై–వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా తెరకెక్కనుంది. “కొన్ని యుద్ధాలు ముగియవు.. కొంతమంది రాజులు మరణిం చరు” అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో విడు దలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమా నేపథ్యంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది చారిత్రక లేదా పురాణ నేపథ్యంతో కూడిన భారీ ఎపిక్ కథగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు, మహిధర్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో, అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆయన పూర్తిగా భిన్నమైన మేకోవర్‌లో కనిపించనున్నారని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని చిత్ర బృందం ప్రణాళిక రూపొందిస్తోంది. విభిన్న కథలను ఎంచుకోవడంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సందీప్ కిషన్, ఈ ఎపిక్ అడ్వెంచర్‌తో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను మరింత విస్తరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

# టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా దిశగా

**వేద న్యూస్ డెస్క్:**



శ్రీలీల తెలుగు, కన్నడ చిత్రసీమల్లో తన ప్రతిభతో వేగంగా ఎదిగిన యువ నటి. అద్భుతమైన అభినయం, ఎనర్జిటిక్ డ్యాన్స్‌లతో తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో ప్రముఖ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. 2001 జూన్ 14న అమెరికాలో జన్మించిన ఆమె, బెంగళూరులో పెరిగింది. శ్రీలీల సినీ ప్రస్థానం 2019లో వచ్చిన కన్నడ చిత్రం ‘కిస్’తో ప్రారంభమైంది. ఆ సినిమాలోనే తన నటన, నృత్యంతో మంచి గుర్తింపు సంపాదించింది. అనంతరం 2021లో కే. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో తెరకెక్కిన ‘పెళ్లి సందడి’తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ చిత్రం ద్వారా ఆమెకు భారీగా క్రేజ్ వచ్చింది. తరువాత టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కించుకున్న శ్రీలీల, ప్రముఖ హీరోల సరసన నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ముఖ్యంగా రవితేజతో చేసిన ‘ధమాకా’, నందమూరి బాలకృష్ణతో చేసిన ‘భగవంత్ కేసరి’, అలాగే మహేష్ బాబుతో నటించిన ‘గుంటూరు కారం’ వంటి చిత్రాలు ఆమెకు మరింత గుర్తింపు తీసుకువచ్చాయి. తన స్టెప్పులు, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో మంచి ఫాలోయింగ్ సంపాదించింది. ఇక 2026 నాటికి శ్రీలీల తన కెరీర్‌ను ఇతర భాషల వైపు విస్తరించుకుంటోంది. తమిళంలో ‘పరాశక్తి’ చిత్రంతో అరంగేట్రం చేయనుండగా, బాలీవుడ్‌లో కూడా ఒక రొమాంటిక్ చిత్రంతో ఎంట్రీ ఇవ్వబోతోంది. దీంతో ఆమె పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. సినిమాలకే పరిమితం కాకుండా, సేవా కార్యక్రమాల్లో కూడా శ్రీలీల చురుకుగా పాల్గొంటోంది. అనాథ పిల్లల కోసం “హియర్ ఫర్ యూ” అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, సామాజిక బాధ్యతను చాటుతోంది. తన స్టార్‌డమ్‌ను సేవకు ఉపయోగించడం ద్వారా అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

# ఎడిటింగ్‌లో కట్ అయిన పాత్రపై దివి ఎమోషన్

**వేద న్యూస్ డెస్క్:**



బిగ్ బాస్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న నటి దివి తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్టార్ హీరో అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమాలో తన పాత్రను ఎడిటింగ్‌లో భారీగా తగ్గించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఈ సినిమాలో మంచి, పెద్ద పాత్ర ఉందని ముందుగా చెప్పారని, టీజర్‌లో కూడా తన పాత్రకు ప్రాధాన్యత ఇచ్చారని దివి వెల్లడించారు. దీంతో సినిమాలో తన రోల్ ఎక్కువగా ఉంటుందని ఆశపడ్డానని తెలిపారు. కానీ సినిమా విడుదల తర్వాత చూసేసరికి తన పాత్ర చాలా వరకు తొలగించబడిందని తెలిసి షాక్ అయ్యానన్నారు. ఈ విషయంతో చాలా బాధపడ్డానని, 20 రోజులు షూటింగ్ చేసి, 10 రోజులు డబ్బింగ్ చెప్పినా చివరికి ఫలితం ఇలా రావడం నిరాశ కలిగించిందని ఆమె చెప్పుకొచ్చారు. తన ఫ్రెండ్స్‌తో కలిసి థియేటర్‌కి వెళ్లి సినిమా చూసినప్పుడు పరిస్థితి మరింత బాధ కలిగించిందన్నారు. అయితే, ఇలాంటి అనుభవాలు ఇండస్ట్రీలో భాగమేనని అర్థం చేసుకుని ముందుకు సాగాల్సిందేనని దివి స్పష్టం చేశారు. తనకు మంచి అవకాశాలు వస్తాయని, భవిష్యత్తులో మరింత మంచి పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బ్యాండ్ మేళం ట్రైలర్ ఆకట్టుకుంది

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో, దర్శకుడు సతీష్ జవ్వాజి తెరకెక్కించిన మ్యూజికల్ రొమాంటిక్ చిత్రం ‘బ్యాండ్ మేళం’ విడుదలకు సిద్ధమైంది. ‘కోర్ట్’ సినిమాతో గుర్తింపు పొందిన హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్లా జంటగా నటించిన ఈ చిత్రం మార్చి 26న శ్రీరామనవమి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. గ్రామీణ నేపథ్యంతో రూపొందిన ఈ ప్రేమకథపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. చిన్నప్పటి నుంచి బావ, మరదలుగా కలిసి పెరిగిన గిరి, రాజి పాత్రల మధ్య ఉన్న అనుబంధం, తరువాత వారి జీవితాల్లో చోటుచేసుకునే భావోద్వేగ పరిణామాలు కథలో ప్రధానంగా కనిపిస్తున్నాయి. ప్రేమ, అపార్థాలు, సంగీతం చుట్టూ తిరిగే కథాంశం ట్రైలర్‌లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. వినోదం, ఎమోషన్‌ల సమ్మేళనంగా ఈ సినిమా ఉండబోతుందని ట్రైలర్ సూచిస్తోంది. ‘బేబి’ చిత్రంతో సెన్సేషన్ సృష్టించిన సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ ఈ చిత్రానికి సంగీతం అందించగా, పాటలు ఇప్పటికే మంచి స్పందన పొందుతున్నాయి. సీనియర్ నటుడు సాయి కుమార్ కీలక పాత్రలో కనిపించనుండటంతో సినిమాకు మరింత బలం చేకూరింది. మొత్తానికి ‘బ్యాండ్ మేళం’ ఒక స్వచ్ఛమైన పల్లెటూరి ప్రేమకథగా ప్రేక్షకులను అలరించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073